ఎట్టి విద్యలు జగతిని ఎరుగనట్టి
పక్షిజాతులు మృగములు పరమమైన
నియమమును గూడి జీవింప నేర్చియుండ
తెలివి కల్గిన నరునకు ఈ తెలివి లేదె.

ప్రేమస్వరూపులారా!

క్రమశిక్షణ అనేది ప్రతి జీవికి ఒక ప్రధానమైన ప్రాణము. అందులో మానవునికి క్రమశిక్షణ వెన్నెముక వంటిది. క్రమశిక్షణ లేకుండిన మానవ జీవితము నిర్మూలమవుతుంది. క్రమశిక్షణ అనగా చక్కని నియమమును అనుసరించటము. ఎట్టి నియమములు లేకుండా మానవత్వము నిలచుటకు వీలుకాదు 'నశ్రేయో నియమం వినా' నియమము లేకపోతే శ్రేయస్సు లేదు. ఈ క్రమశిక్షణ గ్రంథములలో చదివేది కాదు. లేక అధ్యాపకుల చేత వినేటువంటిది కాదు. నిత్యజీవితములో క్రమబద్ధంగా తన కర్తవ్యములో ఈ క్రమశిక్షణ అలవరచుకోవాలి. తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంత వరకు ఎల్లవేళల ఈ క్రమశిక్షణ అత్యవసరము ప్రతి సమాజమునకు, ప్రతి సంఘమునకు, రాజకీయమునకు చాలా అవసరము. ఈ క్రమశిక్షణే లేకుండిన సమాజమే కాదు. ఈ క్రమశిక్షణే లేకుండిన అది ఒక రాజకీయమే కాదు. క్రమశిక్షణే లేకుండిన అది ఒక సంఘమే కాదు. క్రమశిక్షణ లేకుండిన అది జాతియే కాదు. వ్యక్తికి వ్యక్తికి మధ్య, వ్యక్తికి సమాజమునకు మధ్య, సమాజమునకు సమాజమునకు మధ్య ఈ క్రమశిక్షణ ఏకత్వాన్ని అందిస్తుంది. కనుక క్రమశిక్షణ జీవితమునకు ప్రధానమైన లక్షణము.

ఆటలందు పాటలందు మాటలందు ఈ క్రమశిక్షణ అత్యవసరం. క్రమశిక్షణ తప్పక పాటించాలి. భజన చేస్తున్నారు. భజన చేసే సమయంలో కోరస్ చేసే కొంతమంది జిన్నప్పటికి ఒకే స్థాయిలో అందరు దానిని అనుసరించాలి. ఒక్కొక్క కంఠము ఒక వైపున, ఒక్కొక్క శృతి ఒక వైపున పోయినప్పుడు ఇది వినుటకే ఇంపుగా ఉండదు. కనుకనే

పాటలందు కోరస్ అనేది క్రమ శిక్షణ. ఇంక ఆటలందు. ఈ ఆటలాడే సమయంలో దానికి యజమానిగా ఉన్నవాడు కొన్ని నియమములను పాటించాలని ప్రబోధిస్తాడు. ఈ ఎంపైర చెప్పినది ప్రతి ఒక్కరు తు.చ తప్పకుండా అనుసరించాలి. ఒక్కొక్క సమయంలో మైమరచి ఆనందములో ఈ ఆటలలో పాల్గొని ఆడుతుంటారు. కాని మను ఆనందములో మన దోషం మనకు కన్పించదు కాని గమనిస్తున్న ఎంపైర్ దానిని చూచి తక్షణమే విజిల్ ఊదుతాడు. వెంటనే అందరు నిలచి పోవాలి. ఈ విజిల్ ఊదిన తక్షణమే ఎవరికి వారు ఏ విధమైన చర్య తీసుకొనకుండా స్తంభించి నిలచి పోవాలి. ఈ విజిల్ follow చేయక ఆటలాడిన వాడు క్రమశిక్షణ ఉల్లంఘించినవాడౌ. కనుక ఈనాడు లోకములో ఆటలందు, మాటలందు, పాటలందు ఈ క్రమ శిక్షణ లోపించుటచేతనే జీవితము ఒక భయంకరమైన జీవితంగా రూపొందుతున్నది.

మానవత్వములో క్రమశిక్షణ చాలా అవసరమైనది. కొంతమంది కొన్నిదినములు అధికారం చేజిక్కించుకుంటారు. ఒక వ్యాపారమునందు గాని, వ్యవసాయమునందు గాని ఇంకే విధమైన వృత్తిలో గాని ఒక విధమైన క్రమ శిక్షణ అత్యవసరము. నేను అధికారిని కదా యని, తన చేతిలో పెన్ను ఉందని ఇష్టం వచ్చినట్లుగా వ్రాయకూడదు. నాలుకను ఏమోక లేదు కదా యని ఇష్టం వచ్చినట్లు మాట్లాడకూడదు. కనుక ఈ మాటలు, వ్రాతలు కూడా తగిన పరిమితములో ఉండాలి. మానవుడు ఏ మాట మాట్లాడవలెనన్నా ఇది సరైనదా కాదా అని విచారణ చేసి మాటలు మాట్లాడాలి. ఈ వ్రాతకోతలందు ఇష్టము వచ్చినట్లుగా వ్రాయకూడదు. ఈ వ్రాత భవిష్యత్తులో ఏ విధమైన ముప్పును తెస్తుందో. కనుకనే మొట్టమొదట యోచించుకొని యీ వ్రాతను మనం ప్రయోగించాలి. అధికారము మనం ఏవిధంగా కాపాడుకోవాలంటే క్రమ శిక్షణ వల్లనే కాపాడుకోవాలి. క్రమ శిక్షణ సరిగా ఉన్నప్పుడు ఇంకొక రక్షణ మనకు అవసరం లేదు. మన క్రమశిక్షణే మనలను కాపాడుతుంది. నడకయందు గాని, కూర్చొటంయందు గాని, నవ్వటము యందు గాని ఒక విధమైన క్రమశిక్షణ ఉండాలి. కొంతమంది నడుస్తుంటారు. నలభై అడుగులు వెడల్పు ఉన్న రోడ్డు కూడ వారికి నడవటానికి చాలదు. అటు ఇటు ఇష్టము వచ్చినట్లుగా నడుస్తుంటారు. ట్రాఫిక్‌కి ఏ విధమైన అభ్యంతరము లేకుండా foot path పై మాత్రమే నడుస్తూ పోవాలి. ఆ విధముగా కాక రోడ్డు ఉంది కదా యని ఇష్టం వచ్చినట్లు నడుస్తే క్రమశిక్షణ ఉల్లంఘించిన వారమే కాకుండా ఇతరులకు

కూడ కొంచెం బిడుపు కలిగించిన వారమవుతాము. ఎవరికి ఏవిధమైన నొప్పిని కలిగించకుండా చూసుకోవాలి. కనుకనే help ever, hurt never. అన్నారు. పరులకు ఉపకారం చేసే మార్గములో మనం క్రమశిక్షణను అనుసరించాలి. కనుకనే start early, drive slowly reach safely. అని చెప్పారు.

లేత వయస్సునుండే క్రమశిక్షణ అవసరం. ఇది పిల్లలకు మాత్రమే కాదు అధికారులకు కూడా, అధ్యాపకులకు కూడా, పౌరులకు కూడా ఈ క్రమ శిక్షణ అత్యవసరము. పెద్దలను చూచినపుడు ఏవిధముగా మనం గౌరవించాలి, ఎవరి ముందు ఏవిధముగా మనం కూర్చోవాలి ఈ విధమైన చిన్న చిన్న విషయములందు కూడా మనం క్రమశిక్షణ చక్కగా పాటించాలి. చాలా మంది చిన్న పిల్లలు కూర్చుంటారు. ఒకవిధమైన యారుంబ మాదిరి. ఈ విధంగా కూర్చో కూడదు. చక్కగా కూర్చోవాలి. ఎందుకంటే spinal column straight గా ఉన్నప్పుడే మన thought direct గా బుద్ధికి పోయి చేరుతుంది. అతి స్వల్పకాలములోనే మనము ఏకాగ్రతను పొందగలము. spinal column లో 33 రింగులున్నాయి. ఇందులో 9, 12 మధ్య ఉంటుంది సుషుమ్నా నాడి. అక్కడ సక్రమమైన రీతిగా ఉంటే కుండలినీ శక్తి సహస్రార పద్మమునకు straight గా పోయి చేరుతుంది. చాలా మంది మూలాధార స్థానంలో కుండలిని అనే సర్పము ఉంటుందని క్రమక్రమేణా అది పైకి వెడుతూ సహస్రార చక్రమును చేరుతుందని యోగాభ్యాసం తెలిసినవారు ఈ విధమైన మాటలతో చెబుతారు. ఈ కుండలిని శక్తి మూలాధార స్థానములో ఎప్పుడు ఉంటుంది? చాలామంది ప్రాణాయామము చేస్తుంటారు. ఈ ప్రాణాయామ సమయమందు గాలిని నిలబెట్టి కుండలిని చేస్తుంటారు. గాలి నిలచి పోవటంచేత ఈ మూలాధార చక్రమునకు గాలి లేకపోవటంచేత అది గాలి నిమిత్తం పైకి పోతుంది. ఇది ఒక సర్పము కాదు. ఇది కేవలం గాలి. అది ఈ 33 రంధ్రముల ద్వారా క్రమక్రమేణా పెరుగుతూ వస్తుంది. మనము ఈ కుండలినీ శక్తి తెలుసుకోవాలంటే మన యొక్క వెన్నెముకను straight గా పెట్టుకోవాలి. అందుకోసమే యోగాభ్యాసము చేసేవారు straight గా కూర్చుంటారు. అది చాలా మంచిది. జ్ఞాపకశక్తిని అందిస్తుంది. ప్రశాంతతను కలిగిస్తుంది. కనుక మనం కూర్చోటం కూడా క్రమశిక్షణే.

ఈ క్రమశిక్షణ మనకు సక్రమంగా జరగాలంటే దీనికి కొన్ని విధములైన పరిశుద్ధతలుంటున్నాయి. మొట్టమొదట మన దేహమును పరిశుద్ధము చేసుకోవాలి. ఏమిటి ఈ పరిశుద్ధము?

నీటితో, సోపుతో యింకా వివిధమైన మెటీరియల్‌తో కాదు దీనిని పరిశుద్ధము చేసుకోటం. దేహము పరిశుద్ధము కావాలంటే సత్కర్మలలో ప్రవేశించాలి. సత్కర్మల వలనే దేహము పరిశుద్ధమవుతుంది కర్మ వలనే చిత్తశుద్ధి కలుగుతుంది. మన గ్రంథాల వలన మనమనస్సు పరిశుద్ధం చేసుకోవాలి ఈ రెండింటిని మనం పరిశుద్ధము చేసుకున్నప్పుడు బుద్ధి ఎప్పుడు పరిశుద్ధంగానే ఉంటుంది. దేహములో నున్న మొట్టమొదటి శబ్దం ఏమిటి? అహం అహం. నేను నేను అనేది. నేను ఎక్కడ పుట్టింది? ఈ అహం ఆత్మనుండియే పుట్టింది. ఈ అహం నుండి మైండ్ పుడుతూ వచ్చింది. మైండు నుంచి వాక్కు పుడుతూ వచ్చింది. అహం ఆత్మయొక్క కుమారుడు. అహంకు మైండ్ పుట్టింది. మైండ్ ఆత్మకు grand son. మైండు నుండి వాక్కు పుట్టింది. వాక్కు ఆత్మకు grand son. ఇవన్నీ ఆత్మకు సంబంధించిన కుటుంబమే. ఆత్మ ఎంత పరిశుద్ధమైనదో మైండ్ అంత పరిశుద్ధము కావాలి. మైండ్ ఎంత పరిశుద్ధమైనదో అహం అనే జీవాత్మ అంత పరిశుద్ధం కావాలి. కనుక ఆత్మ సంబంధమైన ఈ కుటుంబమంతా పరిశుద్ధమైన భావాలు రావాలి. ఒక్కొక్క సమయంలో ఇచ్చిన మాట తప్పుతాము ఇచ్చిన మాట తప్పుటకంటె మరొక పాపము లేదు. బలిచక్రవర్తి చెప్పాడు. 'పలికి బొంకుటకంటె పాపమున్నె'. పలికి బొంకుటకంటె మరొక పాపము లేదు. వాక్కు మనం పవిత్రంగా కాపాడుకోవాలి.

షిరిడిలో ఉండినప్పుడు అనేకమంది భక్తులు షిరిడీ వచ్చేవారు. అక్కడ తర్కడ్ అనే ఒక సిరస్తదారు ఉండేవాడు. అతనికి భార్య, పదహారు సంవత్సరముల కుమారుడు ఉండేవాడు. భార్య, కుమారునికి బాబా అంటే చాలా విశ్వాసము. వారికి ఏ విధమైన అడ్డు చెప్పేవాడు కాదు తర్కడ్. ఒకదినము మేము షిరిడీ వెళ్ళాలి అన్నారు భార్య, కుమారుడు. తప్పక వెళ్ళమన్నాడు. ఇతను బ్రహ్మసమాజమువాడు. ఇతనికి క్షేత్రానికి పోవుటకు ఇష్టము లేదు. భార్య ప్రార్థించినా ఇతను షిరిడీ పోలేదు. అది కూడా బలహీనతే. ఎందుకంటే ఏ సమాజమైతే మనకేమి సర్వేశ్వరుడు ఒకడే అనిగుర్తించాలి. కొంతమంది ఈ కుల మతములను చేసుకొని వంకర మార్గము ప్రవేశిస్తుంటారు. ఈ బ్రహ్మసమాజము వాడైన తర్కడ్ నేను రాను మీరు వెళ్ళండి అన్నాడు. ఆ పదహారు సంవత్సరముల కుమారుడు చెప్పాడు 'నాన్నా నేను వెళ్ళను'. ఎందుకోసం వెళ్ళవు? 'నేను నిత్యపూజలో తెల్లవారి మొదలు రాత్రి వరకు క్రమశిక్షణగా పాటిస్తున్నాను. ఇంటి చిత్రపటానికి నైవేద్యము పెడుతున్నాను. ఇది బాబా స్వీకరించాడనే విశ్వాసముతో తిరిగి అతని ప్రసాదముగా స్వీకరిస్తున్నాను. ఈ పద్ధతిని నేను వదలటం ఇష్టం లేదు. కనుక నేను షిరిడీ వెళ్ళను' అన్నాడు. కుమారునిపై తండ్రికి ప్రేమ ఎక్కువ

కుమారుని కష్టపెట్టటం ఇష్టములేక తండ్రి చెప్పాడు' బాబూ ఆపని నేను చేస్తాను. నీవువెళ్లు' అన్నాడు. 'నిజంగా చేస్తావా' అని కుమారుడు గట్టిగా అడిగాడు. 'బాబాకు నీవు పూజ చేస్తావా నేను చెప్పినట్లుగా. బాబాకు నైవేద్యం పెడతావా ? ఆ నైవేద్యము స్వీకరిస్తావా ?' మాటఇవ్వు. నేను షిరిడీ పోలేను లేకపోతే పోను' అన్నాడు. ఈ పిల్లవాని పట్టుదల చూచి తండ్రి మనసు కరగింది. ఇంతక్రమశిక్షణ పాటించేవారు ఎంత జిత్తములు. ఇంత వయస్సు వచ్చినా నాకు ఈ క్రమశిక్షణ లేదుకదా! అని విచారం చేశాడు. కుమారునికి నేను చేస్తానని మాటఇచ్చాడు. కుమారుడు తల్లివెళ్ళారు. కుమారునికి మాట ఇచ్చిన ప్రకారము పూజ సక్రమంగా చేశాడు తండ్రి.. కుమారుడు చేసినట్లు ఖండ చక్కెర అక్కడ పెట్టటము తిరిగి భోజనము చేసే సమయములో ప్రసాదము భుజించటము ఈ విధముగా జరుగుతూ వచ్చింది. మూడవ దినము గురువారము వచ్చింది. కోర్టులో అవసరమైన పని పడింది. స్నానం చేసి పూజ చేశాడు టిఫిన్ తిన్నాడు. తన డ్రస్సు వేసుకొని ఆఫీసుకు వెళ్లాడు తిరిగి భోజనమునకు వచ్చాడు. భోజనమునకు కూర్చున్న తరువాత వంటవానిని ప్రసాదము లేదు కురమ్మన్నాడు. వంటవాడు చెప్పాడు,' మీరు అవసరంగా పోతూ ప్రసాదము నివేదన చేయలేదు.' చాలా బాధపడ్డాడు. కుమారునకు ఇచ్చిన మాట తప్పినాను కదా! బాబాకు నైవేద్యము పెట్టలేదని బాధకాదు. కుమారునకు ఇచ్చిన వాగ్దానము తప్పినాను అదే బాధ. రెండవ దినము తర్ఖడ్ భార్య కుమారుడు నమస్కారం చేయుటానికి వచ్చారు. 'బాబూ నేను నిన్న బాంద్రాకి పోయాను. కానీ అక్కడ నొకరు భోజనం పెట్టలేదు. నిత్యము నీవు ఇస్తున్న ఖండ చక్కెర నాకు చిక్కలేదు. చాలా ఆకలిగా తిరిగి వచ్చాను. ఇప్పుడేమైనా ఇస్తే బాబు' అని ఆ పిల్లవానిని అడిగాడు బాబా. ఆ పిల్లవానికి shock మాదిరి అయింది. ఇంటికి వెళ్ళి తల్లి ఒడిలో ఏడుస్తూ కూర్చున్నాడు. తండ్రి మాట ఇచ్చాడు కాని నైవేద్యము పెట్టలేదు. కనుకనే బాబా నిరాశగా వచ్చాడు. అమ్మా నేను ఇక్కడ ఉండను. నా క్రమశిక్షణ నేను తప్పను. నేను తిరిగి బాంద్రా వెడతాను. అనేప్పటికి బాబా చెప్పి పంపించాడు. ఎవరితో చెప్పి పంపించాడు. జోగ్ అనే అతనితో. బాబా దగ్గర జోగ్ ఎప్పుడూ ఉండే వాడు. పిల్లవానికి చెప్పి పంపాడు. నీవు ఇప్పుడు పోనక్కరలేదు. నీ తండ్రి మాట తప్పాడు గానీ నీవు మాట తప్ప లేదు. కాబట్టి నా అనుగ్రహం దండిగా ఉంది. నీవు వెళ్లనక్కరలేదు. ఎంతకాలము నీకు ఇష్టమో అంతకాలము ఉండు.

కానీ అంతకాలం కొంత నిరాశగా, అసంతృప్తిగా కాలం గడుపుతూ వచ్చాడు. పది

దినములైన తరువాత ఇక్కడికి వచ్చాడు. పిల్లవాడు వచ్చిన వెంటనే. తండ్రి పిల్లవాని దగ్గరపోయి excuse me అన్నాడు. నువ్వు చిన్నవాడవు. నేను పెద్దవాడను. కాని నిన్ను క్షమాపణ వేడుకొంటున్నాను. అప్పుడు పిల్లవాడు చెప్పాడు, క్షమాపణ నాకు కాదు బాబాకు చెప్పమన్నాడు. ఏ సమాజములో ఉండినప్పటికి, ఏ విధమైన కల్చరు నీకుండినప్పటికి మాట మాత్రం ఒక్కటే. నది బ్రహ్మ సమాజం కావచ్చు. ఆర్యసమాజం కావచ్చు. ఏ సమాజమైనా మాట ఒకటే. సత్యం ఒకటే. సత్యాన్ని పాటించటం నీకు చాలా అవసరం. నీవు కోర్టుకు వెళ్ళి న్యాయాధిపతిగా వాదిస్తున్నావు. నీలో సత్యమే లేకపోతే ఎన్ని కుటుంబాలు వ్యర్థమైపోతాయి. నీవు లా చదివావు. మను చక్రవర్తి ఎంతో పవిత్రమైన ధర్మాన్ని ప్రబోధిస్తూ వచ్చాడు. కనుక ఈ సత్యాన్ని నీవు పాటించకపోతే నీ లా అంతా వ్యర్థము అన్నాడు. ఆ విధంగా మనం సత్యమంగా పాటిస్తున్నప్పుడు దైవత్వము మనకు సాక్షాత్కరిస్తుంది.

మొట్టమొదట మన దేహమును సత్కర్మల చేత పరిశుద్ధము గావించుకోవాలి. మొట్ట మొదట discipline. తెల్లవారి లేచి కాలకృత్యములు తీర్చుకొని రాత్రి పరుండినంత వరకు నిత్యము ఆచరించే క్రమశిక్షణ చక్కగా ఆచరించాలి

నిద్దర నుండి లేచి మరి నిద్దర పోయెడు దాక పొట్టకై
హద్దు పద్దు లేక శ్రమమందగ చేయుచు జీవితంబున
విద్దెల ధార పోసి అరవింద దళాక్షుని విస్మరించి నీవే
పెద్ద సుఖంబు నొందితివా ఛీతిగ యోచన చేయు మానవా.

పొట్టకు కూడా ఒక discipline ఉండాలి. ఎంతవరకు పడుతుందో అంతవరకు తీసుకోవాలి. మితి మీరి తింటే అది ఒక అజీర్ణ రోగంగా బయలుదేరుతుంది. ఈ జిహ్వాగ్ని యొక్క ఆజ్ఞను కూడా మనం పరిపాలించటం లేదు. మనం ప్రార్థన చేసి తీసుకుంటున్నాము.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మసమాధినా.

బ్రహ్మార్పణమని అర్పణం చేస్తే అహం వైశ్వానరో భూత్వా అని జవాబు వస్తున్నది- నేను వైశ్వానరుడుగా నీలో ఉంటున్నాను. నాకు ఎంత కావలెనో అంతే అందించు. ఎక్కువ తీసుకుంటాం రుచిగా ఉందని. అప్పుడు వైశ్వానరుడు జాగ్రత్త పడలాడు. ఇంక పంపవద్దు లోపలకు. కాని ఈ మాటలు ఏ మాత్రం వినడు చక్కని పాయసము చక్కని గారెలు చిక్కుతుందాయని తిరిగి వేస్తూనే ఉంటాడు. కాని

కడపటికి తాను కలిసి పోలేడు. ఆయాసములో కొంత బాధపడలేడు. కనుకనే మన ఆహారమందు క్రమశిక్షణ లేకపోతే అనారోగ్యము రూపొందుతుంది. క్రమశిక్షణ లేక పోవటము అనారోగ్యమునకు మూలకారణము. దేహములో సర్వవ్యాధులకు మూలకారణము కడుపు. కడుపులో ఏవిధమైన చెడుపు జరిగినా శరీరములో అన్ని రోగములు బయలుదేరుతున్నాయి. కనుక మూడు భాగములు ఆహారము పెట్టుకొని ఒక భాగము ఖాళీగా పెట్టాలి. ఈ విధముగా జరిగినప్పుడే క్రమశిక్షణ ఉంటుంది. నిత్యము క్రమశిక్షణ అనుసరించాలి. తెల్లవారి మొదలు రాత్రి పరుండినంత వరకు ఏమేమి చేస్తున్నామో అవన్నీ క్రమశిక్షణలో చేయాలి. మాట్లాటం, నడవటం, త్రాగటం, వినటం అన్నీ క్రమశిక్షణలో ఉండాలి. అప్పుడే జీవితము ఒక క్రమమైన పద్ధతిలో ఉంటుంది.

ఈ క్రమశిక్షణయే నిజమైన కర్మయోగము. ఈ కర్మయోగమే కర్మసుకౌశలాన్ని అందిస్తుంది. మానవుడు కర్మాధికారి. కర్మాధికారులుగా మనం ఉండాలి. ఎలాంటి కర్మగా ఉండాలి. పరిమితమైన కర్మగా ఉంటుండాలి. భగవదాజ్ఞ శిరసావహించాలి. పూట పూటకు ఏవిధమైనది మనం ఆచరిస్తున్నామో దాని క్రమం తప్పక అనుసరించాలి. అప్పుడే మనము విద్యావంతులము కావచ్చు. విద్య అనగా ఏమిటి? జ్ఞానము. ఆ జ్ఞానము పొందే మార్గము ఇదే.

పుస్తకముల్ పఠించితిని పూర్తిగ జూచితి సర్వశాస్త్రముల్
నిస్తులమైన విద్యలు నేర్చితి నంచును గర్వమేలనా
హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితో కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియు ధాత్రి నిరర్థకముల్ కద మానవా!

పుస్తకాలు చదివాను. Bookish knowledge చాలా ఉందని గర్వపడకూడదు. మనము హస్తయుగము మోడ్చాలి. ఇదియే ఆధ్యాత్మికమునకు ప్రథమ సోపానము. ఏమిటి ఈ హస్తయుగము మోడ్చటం. నమస్కారము. నమస్కారములో నున్న అంతరార్థము ఏమిటి? ఐదు కర్మేంద్రియములు ఐదు జ్ఞానేంద్రియములు ఏకము చేయుటము నమస్కారము. ఏకాత్మ తత్త్వమే నిజమైన ఆత్మతత్త్వము. ఆధ్యాత్మికములో నమస్కారము చాలా ప్రధానమైనది. ఎంతో అర్థము ఉంటున్నది. న-మమ. నేను కాదు. నమస్కారమంటే నేను కాదు. అంతా నీదే స్వామి! ఈ అర్పితముగా ఉంచటమే నమస్కారము యొక్క అంతరార్థము కనుకనే తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండినంత వరకు ప్రతి పనియందు క్రమశిక్షణ పాటించాలి. కానీ ఈనాటి మానవులకు క్రమశిక్షణ అంటే ఏమిటో తెలియదు. ఇంద్రియ నిగ్రహమంటే పూర్తి

తెలియదు. కన్నులు చూస్తున్నాయి ఎక్కడ్. కన్నులకు బుద్ధి చెప్పాలి. ఓ నేత్రమా నీవు దేనిని చూస్తున్నావు. చెడ్డ చూపు చూడకూడదు. see no evil see what is good., talk no evil talk what is good., hear no evil hear what is good. think what is good think no evil DO no evil do what is good. This is the way to god. నీవు మంచిని చేయి మంచిని చూడు, మంచిని చెప్పు, మంచిని విను, మంచిని తలచు. మనము క్రమశిక్షణ పెంపొందించుకోవాలి. ఎవరెన్ని విధములుగా నిన్ను మాట్లాడించినప్పటికి మాటలను కొంచెం అదుపులో పెట్టుకోవాలి.

విద్యార్థులారా మృగములు, పక్షులు కొన్ని క్రమశిక్షణలు పాటిస్తున్నాయి. కాని ఇంత చదువులు చదివి, ఇన్ని తెలివి తేటలుండి మానవుడు ఈ విధమైన క్రమశిక్షణ అనుసరించలేకపోతున్నాడు. మీరు చక్కగా watch చేయండి. మీ కాలేజి దగ్గర, హాస్టలు దగ్గర కొన్ని కాకులు ఉంటున్నాయి. దినమునకు ఒక గంట మౌనము వహిస్తాయి. పక్షులు కూడా అంతే గంట మౌనము వహిస్తాయి. కాని మానవుడు ఒక్క నిముషము కూడా విశ్రాంతి తీసుకోడు. ఊరికే డోలు వాగినట్లు వాగుతుంటారు. మౌనము నేడే లేదు. ఎవరైనా మౌనముగా ఉంటున్నారంటే వారిని గేలి చేస్తారు. ఆయన మౌనం పాటిస్తున్నాడు మనం మౌనం పాటించుదామని ముందుకు రావాలి. బ్రహ్మ అంటే ఎవరు? నిశ్శబ్దం బ్రహ్మ. silence is GOD. నిశ్శబ్దములో నిశ్శబ్దమే బ్రహ్మ. అంత గొప్పదనము ఉంటున్నది మాటల అదుపులో ఫల. మాటలను కంట్రోలు చేస్తే అంతా కంట్రోలు అయిపోతుంది. ఎందుకోసం దీనికి ఇంత శక్తినిచ్చారు. కంటికి చూచే శక్తి మాత్రమే ఉంటున్నది. రెండవ శక్తి లేదు. చెవులకు వినే శక్తి మాత్రమే ఉంటున్నది. ఇంకొక శక్తి లేదు. ముక్కుకు వాసన చూచే శక్తి ఉందిగాని యింకొక శక్తి లేదు. నాలుకకు రెండు శక్తులున్నాయి. ఒకటి రుచి చూడటము, రెండవది మాట్లాడటము. రెండు శక్తులున్నాయి కనుక మొట్టమొదట అదుపులో పెట్టాలి. చాలామందికి తెలుసు. కారుకు నాలుగు టైర్లుంటాయి. ముందు టైర్లలో గాలి కొంచెం ఎక్కువగా ఉంటుంది. వెనుక టైర్లలో కొంచెం తక్కువగా ఉంటుంది. తెలియని వారు నాలుగు టైర్లలోను సమానంగా నింపుకుంటారు. అది మంచిది కాదు. ఎక్కువగా ఉన్న దానిని తగ్గించాలి. తక్కువగా ఉన్న దానిని పెంచాలి.

రామకృష్ణ పరమహంస కమలాపూర్ లో ఉండేవాడు. అక్కడ చిన్న ఆశ్రమము ఉండేది. అక్కడ రామకృష్ణ పరమహంస ఆహారములో కొంచెము మార్పు. బెంగాల్ దేశములో

బ్రాహ్మణులు కూడా చేపలు తింటారు. వారు స్నానమునకు గంగకు పోతే చేపలు కాళ్లను వచ్చి కరచుకుంటాయి. చేతిలో పట్టుకొని ఇంటికి వస్తుంటారు. కమలక్ పూర్ నుండి కలకత్తాకు పోవాలంటే గంగానది దాటాలి. చిన్న వారిని అందరిని చేర్చుకొని ఆధ్యాత్మికము కథల రీతిగా బోధించేవాడు. కానీ ఆనాటి కలి ప్రభావము మంచి సత్సంగము చూస్తే హాస్యము చేయుటము. ఇంత చిన్న వయస్సులోనే ఎందుకురా భక్తి ఉద్యోగము చేసి రిటైరు అయిన తరువాత నీవు రామ, కృష్ణా, గోవిందా అనుకో. ఇప్పటి నుంచి ఎందుకు నీకీ భక్తి అని యువకులను తల్లిదండ్రులు దూషిస్తుంటారు. విమర్శిస్తుంటారు. ఆనాటి యువకులందరు రామకృష్ణ దగ్గర చేరారు. ఒక టైమ్ టేబుల్ వేశాడు రామకృష్ణ. ఫలాన దినము నీవు ఫలానా దినము నీవు సిటీకి పోయి చేపలు తేవాలి. ఒకనాడు బ్రహ్మానందము వెళ్లడు బోటులో. ఆ బ్రహ్మానందము వస్తుండగనే కాషాయ వస్త్రము చూచారు పడవవారు. మొదలుపెట్టారు దూషణ. ఆ పిచ్చివానికి పనిలేదు ఈపిల్లలకు కూడా పనిలేదు. అనవసరంగా పిల్లలను చేర్చుకొని చెడగొడుతున్నాడు వీడు దొంగ అని రామకృష్ణను ఇష్టము వచ్చినట్లుగా దూషిస్తున్నారు. రామకృష్ణను పిచ్చివానిగా చూచేవారు. గురువును దూషిస్తుంటే సహించుకోలేక పోయాడు. కానీ ఏమి చేయగలడు మెత్తని వాడు. నోరు మూసుకున్నాడు. వెళ్లాడు పడవలో తిరిగి రావాలంటే భయం. తిరిగి ఏమి విమర్శిస్తారో ఏమిటో నని భయము. ఆశ్రమమునకు వచ్చాడు. బ్రహ్మానందము రా ఉన్నాడు. కన్నీటి తుడుచుకుంటూ వచ్చాడు. ఎందుకోసం ఏడుస్తున్నావు? 'స్వామి! ఈ ప్రజలు మిమ్మల్ని అవమానాలు అంటున్నారు. చాలా కఠినమైన మాటలతో మిమ్మల్ని దూషిస్తున్నారు. మమ్మల్ని విమర్శించినా పరవాలేదు. మిమ్మల్ని విమర్శిస్తున్నారు. నేను వినలేను. చాలా దుఃఖముగా ఉంది' అన్నాడు. కోపం వచ్చింది రామకృష్ణకు. ఛీ ఛీ! గురుదూషణ వినే శిష్యుడు ఒక శిష్యుడా. నీవు ఆశ్రమంలో ఉండటానికి వీల్లేదు. ఫోటంట. ఎట్లా నీవు వింటూ వచ్చావు. గురుదూషణ వినటం పాపం కాదా. దూషణ చేయటం వారికి పాపము. వినటము నీ పాపము. కానీ ఏమి చేయగలడు తిరిగి ఏడ్చుకుంటూ కూర్చున్నాడు. రెండవ దినము నరేంద్ర పోవలసి వచ్చింది. వివేకానంద. ఇతనిని కూడా ఆవిధంగా దూషించారు. బోటులోని వారందరూ. హాస్యం చేస్తూ వచ్చారు. పడవ ఎక్కాడు టికెట్టు తీసుకున్నాడు. నోరు ముయ్యి అన్నాడు. తిట్టిన వానిని. ఇంకా తిడుతూ వచ్చాడు వాడు. తనశక్తి కొద్దీ కొట్టాడు వాళ్లను. ఒకని ఎత్తుకొని గంగలో వేస్తాను అన్నాడు. భయపడిపోయారు. ఎవరు తిరిగి నోరెత్త లేదు. పోయి చేపలు తీసుకొని వచ్చాడు. ఇతను వస్తుంటే అందరికీ భయము. ఎవరు మాట్లాడలేదు వచ్చిన తరువాత

రా' అన్నాడు 'ఏమి జరిగింది' బ్రహ్మానందముకు జరిగింది జరిగింది అన్నాడు. నేను ఏమి చేశాను అన్నాడు. నేను ఊరుకుంటానా నా గురువును దూషిస్తుంటే ఊరుకోలేను. బాగా రెండు కొట్టాను. ఒకటి గంగలో పడవేయుటకు ప్రయత్నించాను అన్నాడు. రామకృష్ణ 'ఛీ! ఛీ! వేసినది కాషాయ వస్త్రము ఉండేది ఆశ్రమము. నీవు ఇంత మాత్రము కోపము నిగ్రహించుకోలేకపోతే ఎందుకు ఆశ్రమంలో ఉండాలి: లోకులు కాకులు. వారికి లోకువల్లుగా మాట్లాడుతుంటారు. మనము ఏమాత్రము పట్టించుకోకూడదు. సన్యాసులుగా ఉండినప్పుడు మనము శాంతము వహించాలి' అప్పుడు చెప్పాడు నరేంద్రుడు, ఆయన పూర్వము బ్రహ్మసమాజము నందున్నవాడు. 'స్వామి! నిన్న బ్రహ్మానందమునకు అవిధముగా చెప్పారు. నాకు విరుద్ధముగా చెబుతున్నారే. అది నిజమా ఇది నిజమా!' ఒరే పిచ్చివాడా! టైరులోపల గాలి ఎక్కువ ఉంటే వదిలివేయాలి. తక్కువగా ఉంటే కొట్టాలి. బ్రహ్మానందములో గాలి తక్కువగా ఉంటున్నది. కనుక గాలి ఊదాను. నీకు టెంపరు తగ్గించాలి. పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని ప్రబోధలు సల్పాలి. ఈ ప్రబోధలు అందరికి సమానమైనవి కావు. ఒక్కొక్కరి కెపాసిటి, ఒక్కొక్కరి container ఏవిధంగా ఉంటుందో అంతవరకే ఇవి నిండుతాయి. గంగానదిలో కావలసినంత జలము ఉన్నది. ఎవరెవరు ఎంత పాత్ర తీసుకుపోతారో అంత పాత్రకే నీరు చిక్కుతుంది. అందరికి సమానమని చెప్పటానికి వీలు కాదు. ఆధ్యాత్మికమార్గమున వారివారి శక్త్యానుసారంగా క్రమశిక్షణ అనుసరించినప్పుడు వారికి తగిన శక్తి నందిస్తాడు భగవంతుడు. మన కెపాసిటి పెంచుకోవాలనుకుంటే క్రమశిక్షణ చక్కగా ఉండాలి. క్రమశిక్షణ లేక దైవత్వము ప్రాప్తించదు. ఒక దినము ఒక రీతిగా మరొక దినము మరొక రీతిగా ఉంటుంటే ఏమాత్రము సరైనది కాదు.

ఒక చిన్న ఉదాహరణము. మీరు సాయంకాలము ఆరుగంటలకు భజన చేస్తున్నారు. లేక ధ్యానము చేస్తున్నారు. కొన్ని సమయములలో ప్రయాణము చేయవలసి వస్తుంది. ఆ ప్రయాణములో మీరు బస్సులో ఉంటారు ఆరుగంటలకు. కొంతమంది స్థలము, కాలము, కర్తవ్యము ఏమాత్రము మార్చకూడదంటారు. కాని dutyని మాత్రం పెట్టుకోవాలి. స్థలము మారినప్పటికిని, కాలము ఎక్కడైనా ఆరుగంటలే. ఆరుగంటల టైములో బస్సులో ఉంటే అక్కడే భజన చింతిస్తూ రా. నీ మనస్సు అక్కడికి వస్తుంది. స్థలము నీ దగ్గరకే వస్తుంది గాని నీవు స్థలము దగ్గరకు పోనక్కరలేదు. నీ క్రమము తప్పక రా. క్రమము తప్పక పాటిస్తే అన్నీ నీ దగ్గరకే వస్తాయి. కాలము కాయమును మింగుతుంది. కాని కాలమును కాలుడు మింగివేస్తాడు. కాలుడు ఎవరు? అతనే దైవము.

యముడు అనుకుంటారు. కాదు.కాదు. అంతా కాలమే అతడే కాలుడు. కొంత మంది పిల్లలకు కొన్ని సందేహాలు వస్తాయి. సూర్యుని కుమారుడు పుట్టాడు. యముడు సూర్యుని కుమారుడంటారు. పిల్లలందరకు ప్రశ్నము వస్తుంది. సూర్యుడు. సూర్యునికి భార్య. ఒక బిడ్డ. ఇవన్నీ కథలని చెప్పివేస్తారు. కాదు.కాదు. ఇది సత్యము. కాలము ఎవరి వల్ల కలుగుతుంది. సూర్యోదయము సూర్యాస్తమానము వలన కలుగుతున్నది. సూర్యోదయము, సూర్యాస్తమయము సూర్యుని తో పుట్టింది. కాబట్టి సూర్యుని కుమారుడు ఉన్నాడు. తెల్లవారి సూర్యుడు పుట్టినప్పుడు 6 గంటలు అన్నాము. సూర్యాస్తమయము అప్పుడు 6 గంటలైంది. 12 గంటలు జరిగి పోయింది. ఈ 12 గంటల కాలము ఎవరి వల్ల జరిగింది. ఎవరి వల్ల పుట్టింది? సూర్యుని వలనే పుట్టింది. కాబట్టి కాలము సూర్యుని కుమారుడు. ఆత్మ సంబంధమైన అంతరార్థమును విచారించినప్పుడంతా సత్యమే. ఏ విధమైన సందేహమునకు అవకాశము లేదు. మన పురాణ ఇతిహాసములందు ఇలాంటివి అనేకము వస్తాయి. ఇవన్నీ ప్రాకృతమైన వాటితో పోల్చుకొని మనం విశ్వసించము. చాలా పొరపాటు. ఓపికతో చక్కగా విచారించినప్పుడే నీకు సరైన జవాబు చిక్కుతుంది. విష్ణువు, లక్ష్మి, సరస్వతి కమలములనుండి ఉద్భవించినట్లుగా చెబుతున్నారు. అనగా హృదయ కమలము నుండి పుట్టినవే సర్వము. మంచి చెడు అన్న మనసునుండి ఆవిర్భవించినవే. దానికే యద్భావం తద్భవతి అన్నారు. మనము అంతరార్థమును గుర్తించుకొనలేక ఇది అసత్యమని చెప్పివేయకూడదు. ధైర్యము తీసుకొని సందేహములు నిర్మూలము చేసుకో. నిశ్చింతగా ఉండు. అంతేగానీ సందేహములతో మనసు పాడు చేసుకోవద్దు. మన పురాణములందు సందేహములకు అవకాశమే లేదు. ఎవరు వ్రాసినవి ఈ పురాణములు? ఎల్లయ్య మల్లయ్య వ్రాసినవి కావు. మహర్షులు, విద్వాంసులు వాల్మీకి వ్యాసులు వ్రాసినవి. అంత విద్వాంసులు మరొకరు లేరు. అట్టి విద్వాంసులే కవులు కావటానికి అధికారము ఉంటున్నది. అందరు కవులు కారు. వ్యాసుడు అష్టాదశ పురాణములు వ్రాసాడు. అసత్యము అందులో ప్రవేశించటానికి వీలుండదు. మన భావములు పురస్కరించుకొని అసత్యమని చెప్పవచ్చునే గాని అసత్యము వేనాటికి కావు. వ్రాసినవన్నీ సత్యములే. అన్నీ ఆదర్శములే. అంతేగానీ తప్పు మార్గమేదీ వ్రాయలేదు. ఎవరిని చెడపలేదు. ఎవరిని పెడమార్గము పట్టించలేదు. అన్నీ ఆదర్శ గ్రంథములే. ఆదర్శ జీవితము కావాలి. ఆదర్శ జీవితము కావాలంటే మాటలు తగ్గించాలి. దైవాజ్ఞ శిరసా వహించాలి. క్రమశిక్షణ పాటించాలి. ఎలాంటి పరిస్థితియందైనా క్రమశిక్షణ వదలకూడదు. పవిత్రమైన, దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన మన భారతీయ సంస్కృతిని మనము

విడువరాదు. మరువరాదు.

నీ మనస్సు ఇష్టము వచ్చినట్లు పోవచ్చు. కానీ నీవు కదలకు. mind నీ servant. నీవు mind కి servant కాదు. నీ మనస్సుకు నీవు బానిస కాకూడదు. దైవానికి బానిస కావాలి. త్యాగరాజు చెప్పాడు 'దాసానుదాసుడను కావలెరా, నేను నీ దాసులకు సేవసే చేయవలెరా'. ఉదయము సాయంకాలము నేను నీ దాసుడనే. నీ దాసుడనే కాదు నీ దాసానుదాసులకు దాసుడను. ఒక ఉపదేశమున్నది భాగవతములో. కుచేలుడు పిడికెడు అటుకులు తీసుకువెళ్ళాడు. ఆ మాసిపోయిన సద్దలోని అటుకులు కృష్ణుడే తన చేతులారా విప్పాడు. కుచేలుడు చాలా సిగ్గుపడిపోతున్నాడు. నా బట్టలు ముట్టుటానికి తగినవి కానివి. ఇలాంటి దరిద్రుడను. భగవంతుడు చక్రవర్తి. నా బట్టలు ముట్టుకొంటున్నాడు. ఎంత కష్టము. ఎంత పాపిని. అటుకులు కొన్ని నోట్లో వేసుకున్నాడు కృష్ణుడు. కొంచెం మిగిలాయి. రుక్మిణీ పరుగెత్తి వచ్చి చేయి పట్టుకొంది. కుచేలుడు మరొక భావము పడ్డాడు. ఈ మాసిన బట్టలలోనివి తింటున్నాడు ముట్టకూడదని అడ్డుపడుతున్నాదని భావించుకున్నాడు. కాని రుక్మిణి హృదయము కృష్ణునికి తెలుసు. కుచేలునికి అర్థమయ్యేందుకు 'ఎందుకు రుక్మిణీ నా చేయి పట్టుకున్నావు? నేను కుచేలుని దాసుడను కనుక కుచేలుడు తెచ్చిన ప్రసాదము కొంతవరకు స్వీకరించాను'. అప్పుడు రుక్మిణి చెప్పింది. 'కృష్ణా మీరు కుచేలుని దాసుడు. నీ దాసురాలు నేను. కాబట్టి దాసురాలికి భాగముంది కదా. కాబట్టి మిగిలినవి నాకందించ'మంది. భగవద్హృదయములు ఎంత విశాలముగా ఉంటాయి. భగవంతుని సంకల్పములు ఎంత ఘనమైనవిగా ఉంటాయి. కాని వీరు అర్థము చేసుకొనలేక చాలా చులకనగా చేసుకుంటారు. భగవంతుడు ఎంతో విశాలహృదయుడు. ఆ హృదయము మరొకరికి లేదు. ఆ హృదయము భగవంతునికి తప్ప రాదు. అప్పుడు తెలుసుకున్నాడు కుచేలుడు. ఇంటికి పోయి చూశాడు. భవనములంతా చూచారు. భార్యపిల్లలు గొప్ప సంపదతో కూడినవారుగా కనిపించారు. పరుగెత్తి వచ్చి భార్య పాదాలు పట్టుకుంది. 'నాథా! భగవంతుడు ఎంత దయామయుడు, ఎంత విశాల హృదయుడు. అతని ఘనత మరొకరికి లేదు. అతను నీతో ఏమి మాట్లాడాడు. నీతో ఏమి చెప్పాడు' అని మీద మీద ప్రశ్నలు వేసింది. "దేవీ!

నా రాక ఎఱిగినంతనే వేగరమ్మని ద్వారపాలకులచే నాజ్ఞాపించె
నన్ను చూచినంతనే టక్కున గద్దెదిగి నగుమోముతో నను అండజేర్చె
మొదలించి మోము వాచినట్లు ఎగాదిగ జూచి కౌగిట బిగసుకొనియె

ఏమందు అతని దీనపరత పేదకుచేలు అటుకులు పిడికెడు తిని
బహుళ భాగ్యంబు నాసంగువారు కలరా। ప్రేమయే తాను తానే ప్రేమయగును.

ఇంకొకటి వర్ణించుటకు కాదు. అంత విశాలమైన భావము భగవంతునిది.

భగవంతునిది expansion love. కానీ భక్తునిది contraction love. narrow mind. చిన్న ఉదాహరణము. రూమ్‌లో హాస్టలు వార్డెను, విద్యార్థి వీరంతా వచ్చారు. నిన్నటి దినము. హాస్టలు టీచర్సు చేరి ఈ కుర్చీని చేయించారు. అది 70th Birthdays చేయించాలని ప్రయత్నము చేశారు. కాని ప్రయత్నం విఫలమైంది. నిన్నటి దినము వచ్చింది. పాదము బ పట్టుకున్నారు. స్వామి స్వీకరించాలని. 'బాబూ నేను ఇచ్చేదిగానీ తీసుకొనేది లేదు. ఐతే ఈ కుర్చీకి డబ్బు ఎంతైంది? చెప్పలేదు. ఇంత అయింది అని చెబితే ఆ డబ్బు నేను ఇచ్చి కుర్చీ తీసుకుంటాను అన్నాను. చాలా బాధపడ్డారు, ఏడ్చారు. స్వామి మా ప్రార్థన అంగీకరించాలని గట్టిగా పట్టుపట్టారు. పవిత్రమైన హృదయముతో పవిత్రమైన భావముతో శ్రమపడి చేయించారు. దానికి నేను అంగీకరించి పెట్టుకున్నాను. పిల్లలు మంచివారే. పిల్లలు చాలా భక్తిపరులే. స్వామి అంటే కొండంత ప్రేమ. కాని మధ్య మధ్య water bubbles వస్తుంటాయి. అవే కొన్ని వచ్చి మనసును పాడుచేస్తుంటాయి. ఈ పొద్దు చెప్పాను. వార్డెన్! నా దగ్గర బియ్యమున్నాయి. ఆ హాస్టలుకు రెండు వందలు ఈ హాస్టలుకి రెండు వందలు bags తీసుకుపొండి అన్నాను. బసుమతి బియ్యము. ప్రైమరి స్కూలు హాస్టలు, హయ్యర్ సెకండరీ స్కూలు హాస్టలు, ఇన్స్టిట్యూట్ హాస్టలు ఉన్నాయి. మూడింటి రెండు, రెండు, రెండు వందల bags తీసుకుపొండి అన్నాను. వార్డెను చెప్పాడు. పిల్లల డబ్బు ఉంటున్నది. బయట bag వేయి రూపాయలుంటున్నది. డబ్బు యిస్తాను అన్నాడు. పిచ్చివాడా! ఇంతకాలమై ఇదేనా తెలుసుకోటం. 200 bags తీసుకోమని ప్రేమతో పెద్ద హృదయముతో ఇస్తుంటే చిన్న హృదయములో డబ్బు అని భావిస్తున్నావా!. ఇది ఎంత తప్పు అన్నాను. ఎందుకనగా పిల్లలే నా ప్రాపర్టీ. కాబట్టి నా పిల్లలకు నేను ఇస్తున్నాను బియ్యము. నా పిల్లల దగ్గర నేను డబ్బు తీసుకొంటామా! తండ్రి మార్కెట్టుకు వెళ్ళి పిల్లలకు చొక్కాలు కుట్టిస్తాడు పండుగకు. నేను చొక్కా కుట్టించాను ఏభైరూపాయలు నాకియ్యి అని తండ్రి ఏమైనా అడుగుతాడా! ప్రాకృతమైన తండ్రే అడగనప్పుడు విశ్వమునకు తండ్రియైన, విశాల హృదయుడైన స్వామి డబ్బు అడుగుతాడా! ఏనాటికి జరగదు. ఇంత పెద్ద హృదయము స్వామిది. మీరు కూడా ఆత్మనుండి వచ్చారు కనుక ఎంత విశాలముగా

ఉండాలి అంత విశాలము గావించుకోవాలి. మీ హృదయమును విశాలము చేసుకోవాలి. మీరు నావారు అనుకున్నప్పుడు మేము మీవారమని భావించుకోండి. మా స్వామి మా స్వామి అనే వాక్కు మీకుంటున్నది. దానికి తగిన శక్తి మీరు సంపాయించుకోండి. అదే మనకు చాలు. ఆ శక్తి సంపాయించుకోకుండా కేవలం రావటం చదువుకోటం పోవటం మాత్రము ఉంటే ఈ చదువుల వలన ఏమి ప్రయోజనము. ఈ చదువంతా నిరర్థకమైన చదువు. ఇది కాదు మనము నేర్చుకోవలసినది. హృదయాన్ని విశాలము చేసుకోవాలి. స్వామి ఆజ్ఞ ఏమి చెప్పినా తు.చ. నడచుకోవాలి. అప్పుడే ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. అంతవరకు పూర్ణానందము అనుభవించలేరు. ఏనాడు మీరు స్వామి ఆజ్ఞను పాటిస్తారో ఆనాడే ఈ అమృతమయమైన ఆనందము అనుభవించగలరు. నేను ఎప్పుడు రెడీగానే ఉంటున్నాను. కానీ మీరు రెడీగా లేరు. ఒక్కటి మీరు చూడండి. ఫొటోగ్రాఫర్ ఫొటో తీయాలనుకున్నప్పుడు అన్నీ రెడీ చేసుకుంటారు. నీవు అటు ఇటు కదులుతుంటావు. కానీ ఫొటోగ్రాఫర్ రెడీ అంటాడు. ఆ ready అన్నప్పుడు steady గా ఉంటే ఫొటో పడుతుంది. లౌకికమైన, ప్రాకృతమైన ఫొటోగ్రాఫరు రెడీ అంటాడు. మనం రెడీగా ఉండాలి. ఇతను చెప్పకముందు ఎటు తిరిగినా ఫరవా లేదు. కానీ భగవంతుడనే ఫొటోగ్రాఫర ఎప్పుడు రెడీ అంటాడో తెలియదు. కాబట్టి ఎప్పుడు మీరు రెడీగా ఉండాలి. ఎప్పుడు తీస్తాడో ఏమిటో అప్పుడే ఆ హృదయములో మీ చిత్రము చిత్రించుకుపోతుంది. భగవంతుడు పెద్ద ఫొటోగ్రాఫరు. కానీ రెడీ అని చెప్పడు. ఎప్పుడు తీస్తాడో ఫొటో. కనుక మీరు ఎప్పుడు రెడీగా ఉండాలి. దేనికైనా రెడీగా ఉండాలి. అదే సరైన సత్యము. అప్పుడే ఈ పిక్చరు హృదయములో చేరిపోతుంది.